
సారవకోటలో అరటిపండ్ల గెలలతో ఆంజనేయస్వామికి అలంకరణ

శ్రీ ఆంజనేయం

- భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

(శ్రీకాకుళం కల్చరల్/జలుమూరు)

హనుమాన్ జయంతి వేడుకలు జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని.. 'జై వీరాంజనేయ.. శ్రీ ఆంజనేయం' అంటూ పూజలు, అభిషేకాలు చేశారు. హనుమాన్ చాలీసా పఠించారు. శ్రీకాకుళం పుణ్యపువీధిలో ఆంజనేయస్వామికి 108 కలశాలతో పాలాభిషేకం చేశారు. తమలపాకులతో అర్చన, గారెలు, మామిడిపండ్ల నైవేద్యం సమర్పించారు. నిమ్మకాయల దండతో స్వామిని అలంకరించారు. బొబ్బిలికి చెందిన 100 మందితో హరేరామ సంకీర్తన భజన మండలితో కోలాటం, ఊరేగింపు నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని కోదండరామాలయం, నక్కవీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి, బొందిలీపురం, కలెక్టర్ బంగ్లా, మంగువారితోట తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సారవకోటలో అరటిగెలలతో ఆంజనేయస్వామిని అలంకరించారు.


శ్రీకాకుళం పుణ్యపువీధిలోని ఆంజనేయస్వామికి గారెలు, మామిడిపండ్ల నైవేద్యం

కూటమికి జై!



- శ్రీకాకుళం పార్లమెంట్‌తోపాటు మెజార్టీ అసెంబ్లీలు ఎన్డీఏకే..
- వెల్లడించిన పలు సంస్థల ఎగ్జిట్‌పోల్స్
- ఆనందంలో తెలుగుతమ్ముళ్లు..

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్‌లో కచ్చితంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమే అధికారంలోకి వస్తుందని పలు సంస్థలు ఎగ్జిట్‌పోల్స్ ద్వారా వెల్లడించాయి. శనివారం సాయంత్రం ఆరున్నర గంటల తర్వాత ఎగ్జిట్‌పోల్స్ విడుదల కాగా.. మెజార్టీ సంస్థలు ఎన్డీఏ కూటమిదే అధికారమని స్పష్టం చేశాయి. ఇక రైజ్ సంస్థ సీఈవో ప్రవీణ్ రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ నివేదికను శ్రీకాకుళంలో మీడియా సమావేశంలో వెల్లడించారు.

● జిల్లాలో శ్రీకాకుళం లోక్‌సభతో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. శ్రీకాకుళం టీడీపీ ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు మరోసారి గెలుస్తారని సర్వే సంస్థలు చెప్పాయి. అలాగే ఎనిమిది నియోజకవర్గాల్లో ఆరు లేదా ఏడు స్థానాల్లో ఎన్డీఏ కూటమికే పగ్గాలు అప్పజెప్పారని తెలిపాయి. వైసీపీలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటివారు సైతం ఓటమి చెందుతున్నారని వెల్లడించారు. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గంలో టైట్‌ఫైట్ ఉంటుందని సర్వేలో వెల్లడైంది. ఎగ్జిట్ పోల్స్ ఎన్డీఏ కూటమికి అనుకూలంగా రావడంతో తెలుగు తమ్ముళ్లలో సందడి నెలకొంది. బీజేపీ శ్రేణులు, జనసైనికుల్లో కూడా ఉత్సాహం ఉరకలేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజల్లో కూడా ఆనందం కనిపించింది. ఈసారి అధికార మార్పిడి ఖాయమని.. ఎన్డీఏ కూటమి పాలన వస్తుందనే చర్చలు మొదలయ్యాయి. ఏదిఏమైనా తుది ఫలితాల కోసం మరో రెండు రోజులు వేచి చూడాల్సిందే.


శ్రీకాకుళంలో ఎగ్జిట్‌పోల్స్ వెల్లడిస్తున్న రైజ్ సంస్థ సీఈవో ప్రవీణ్

ప్రభుత్వ వైఫల్యాలు బలంగా ప్రజల్లోకి..

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను టీడీపీ జిల్లా నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. సంక్షేమం పేరిట బటన్ నొక్కి డబ్బులు ఖాతాలో వేయడం, అంతకు రెండు, మూడింతలు ఏదో రూపంలో లాక్కోవడం.. అధ్వానంగా మారిన రహదారులు.. అభివృద్ధి గురించి పూర్తిగా పట్టించుకోకపోవడం.. అప్పులు కుప్పలుతెప్పలుగా తీసుకుని రావడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎన్నికలకు ముందే ప్రజల్లోకి వెళ్లిన అధికార పార్టీ నాయకులు ఈవిషయం స్పష్టంగా వెల్లడైంది. అయినా మేకపోతు గాంభీర్యంలో తాము గెలుస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ వచ్చారు. శనివారం ఎగ్జిట్‌పోల్ సర్వేలను చూసి వారంతా కంగుతిన్నారు. గెలుపుపై వారిలో సందేహాలు నెలకొన్నాయి. పార్టీ అధికారంలోకి రావడం సంగతి అటుంచితే.. కనీసం తామైనా గెలుస్తామా? అని ఆరా తీస్తుండడం కనిపించింది.

ఫలితాల ప్రకటనలో అలసత్వం వద్దు

- స్ట్రాంగ్‌రూమ్ వద్ద పటిష్ఠ భద్రత: కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్


స్ట్రాంగ్‌రూమ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనలో పారదర్శకతతో విధులు నిర్వహించాలని, అలసత్వానికి చోటు లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులకు స్పష్టం చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత పటిష్ఠంగా ఉండాలని ఆదేశించారు. శివానీ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌లను శనివారం ఆయన జేసీ నవీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో.. ఏర్పాట్లు, పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా.. అధికారులతో సమీక్షించారు. రౌండ్ వారీ ఫలితాల ప్రకటన కోసం, డేటాఎంట్రీ, టాబ్యులేషన్ సిబ్బంది కచ్చితత్వంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతీ ఒక్కరూ సజావుగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు, డీపీవో వెంకటేశ్వరరావు, చల్లా ఓబులేసు, డిప్యూటీ సీఈవో వెంకటరామన్, ఆర్వోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

శ్రీకాకుళం క్రైం, జూన్1: ఓట్ల లెక్కింపు కేంద్రానికి రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించడంతో పాటు పలు ట్రాఫిక్ ఆంక్షలను ఎస్పీ జీఆర్ రాధిక విధించారు. శనివారం శివానీ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ను ఆమె పరిశీలించారు. అలాగే ట్రాఫిక్‌కు సంబంధించిన పలు అంశాలపై సిబ్బందితో చర్చించారు. 'శ్రీకాకుళం నుంచి చిలకపాలెంలోని శివాని కళాశాలలోని లెక్కింపు కేంద్రానికి వచ్చే కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు ఎన్‌హెచ్-16 మీదుగా కింతలి మిల్లు జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులోకి ప్రవేశించి ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీ మీదుగా శివానీ కళాశాల దగ్గర అండర్ ఫ్లైఓవర్ వద్దకు చేరుకోవాలి. అక్కడ అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది గుర్తింపు పత్రాలు తనిఖీ చేసిన తర్వాత శివానీ కళాశాల లేఅవుట్ మీదుగా పార్కింగ్ స్థలానికి చేరుకోవాలి. ● ఎచ్చెర్ల పోలీసు స్టేషన్ మీదుగా చిలకపాలెం వైపు ఎలాంటి హెవీ వెహికల్స్ అనుమతించబడవు. సాధారణ ప్రయాణికుల వాహనాలు శివాని కళాశాల వద్ద ఉన్న అండర్ ఫ్లైఓవర్ నుంచి చిలకపాలెం సర్వీసు రోడ్ ద్వారా అనుమతిస్తాం. ● శ్రీకాకుళం ఎచ్చెర్ల నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు గేట్ నెంబర్ 1 నుంచి ఫార్మసీ బ్లాక్ కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలి ● ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సిబ్బంది గేట్-2 ద్వారా ట్రిబుల్ ఐటీ బ్లాక్ కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలి. ● ఇచ్ఛాపురం పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు గేట్-3 నుంచి ట్రిబుల్ ఐటీ బ్లాక్ వద్ద ఉన్న కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలి. వీరి వాహనాలను గేట్-2 ద్వారా లోపలికి వచ్చి లేఅవుట్‌లో వారికి కేటాయించిన స్థలాల్లో పార్కింగ్ చేయాలి. ● కౌంటింగ్ సెంటర్‌లోకి సెల్‌ఫోన్‌లు అనుమతించం. రెడ్‌జోన్‌లోకి ఎవరైనా వస్తే చర్యలు తీసుకుంటాం. కౌంటింగ్ రోజున జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది. బాణసంచా కాల్చడం, ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలు, ఫ్లెక్సీలు పెట్టడం నిషేదం. 4న వేకువజామున 3 గంటల నుంచి 5వ తేదీ ఉదయం వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ప్రజలు సహకరించాల'ని ఎస్పీ రాధిక కోరారు.


ట్రాఫిక్ రూల్స్‌పై చర్చిస్తున్న ఎస్పీ రాధిక

చీకటిలో ప్రజాస్వామ్యం

- ఉద్యోగుల సమస్యలపై అంతర్గత చర్చను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం
- ఈసికి ఫిర్యాదు చేస్తా
- జేఏసీ చైర్మన్ సూర్యనారాయణ


సెల్‌ఫోన్ల వెలుతురులోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం.. మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ సూర్యనారాయణ



శ్రీకాకుళం క్రైం, జూన్ 1: 'ప్రజాస్వామ్యం చీకట్లో మగ్గుతోంది. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యవస్థ భయంతో బతికే పరిస్థితి ఏర్పడింది. పేరుకుపోయిన రూ.25వేల కోట్ల బకాయిలు ఎలా చెల్లిస్తారో తెలియని దుస్థితి నెలకొంద'ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘ ఐక్యవేదిక జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆరోపించారు. శనివారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాగా.. అంతర్గత చర్చ నిర్వహిస్తున్న ఐక్యవేదిక నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. హోటల్ యాజమాన్యాన్ని హెచ్చరించి.. విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. హోటల్ పరిసర ప్రాంతాల నుంచి వెళ్లిపోవాలని కొంతమంది నాయకులను ఆదేశించారు. దీంతో జేఏసీ నాయకులంతా రోడ్డెక్కారు. పోలీసుల దౌర్జన్యం నశించాలని నినాదాలు చేశారు. అలాగే హోటల్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చీకట్లోనే.. సెల్‌ఫోన్ల వెలుతురులో సమావేశం కొనసాగించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. పోలీసులు దుర్మార్గంగా హోటల్ యాజమాన్యాన్ని బెదిరించి.. విద్యుత్ సరఫరా నిలిపేసి.. శ్రీకాకుళంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల అంతర్గత చర్చను అడ్డుకోవాలని చూడడం అన్యాయమన్నారు. 'సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం పరిష్కారం చూపలేదు. ఉద్యమాలను అణచివేయడం.. ప్రశ్నించినవారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించడంతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. ఈ నిశ్శబ్దాన్ని ఛేదించాలనే.. ఐక్యవేదిక ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహించి ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్య పరుస్తున్నాం. గత నెల 25న ఐక్యవేదిక ఏర్పడగా.. 15 జిల్లాలో సమావేశాలు నిర్వహించాం. సభలు, సమావేశాలు ఎన్నికల నియమావళికి విరుద్ధమని కొంతమంది ఈసీకి ఫిర్యాదు చేయడం.. మరి కొంతమంది అధికారులు అత్యుత్సాహంతో మాపై చర్యలు తీసుకుంటామని చెప్పడం.. నియంతృత్వ పాలనకు నిదర్శనం. ఉద్యోగ, ఉపాధ్యాయుల పరిస్థితే ఇలా ఉంటే.. సామాన్యుల దుస్థితి ఏంటో అర్థం కావడం లేదు. అంతర్గత చర్చ.. చట్ట విరుద్ధమైతే నోటీసులు ఇవ్వా'లని చాలెంజ్ చేశారు. సమావేశం అనుమతి కోసం ఎస్ఐ హరికృష్ణను అడగ్గా.. దివాళా సంఘాలతో కుమ్మక్కై సమావేశాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించడం దారుణం. దీనిపై ఎన్నికల సంఘానికి, ఉన్నత న్యాయస్థానానికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీజీపీ ఫిర్యాదు చేస్తా'నని సూర్యనారాయణ తెలిపారు.


పోలీసుల తీరును ప్రశ్నిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ మాల్యాద్రి

రైలులో ఏసీ పనిచేయలేదని..

- ప్రయాణికుల ఆందోళన
- పలాసలో రెండు గంటల పాటు నిలిచిన పూరీ-గాంధీదామ్ రైలు

పలాస, జూన్ 1: రైలులో ఏసీ పనిచేయడం ప్రయాణికులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో రెండు గంటలపాటు ప్లాట్‌ఫారంపై రైలు నిలిచిపోవడంతో.. అధికారులు దిగొచ్చి ఏసీ బాగు చేస్తామని భరోసా ఇవ్వడంతో శాంతించారు. పలాస రైల్వేస్టేషన్‌లో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పూరీ-గాంధీదామ్(22974) సూపర్‌ఫాస్ట్ రైలు పూరీలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలు దేరింది. ప్రారంభంలోనే ఏసీ సక్రమంగా పనిచేయడం లేదని బి-5 కోచ్‌లో ఉన్న ప్రయాణికులు గుర్తించి ఖుర్ధారోడ్‌లో రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. బరంపురం రైల్వేస్టేషన్‌లో బాగుచేస్తామని వారు బదులిచ్చారు. బరంపురం వద్ద టెక్నీషియన్లు రాలేదు. అప్పటికే రైలు ఆలస్యం కావడంతో సోంపేట వద్ద సరిచేస్తామని అధికారులు చెప్పారు. మళ్లీ పలాస వద్ద అంటూ చెప్పడంతో ప్రయాణికులు మండిపడ్డారు. సాయంత్రం 4 గంటలకు రైలు పలాసకు చేరుకోగా.. ప్రయాణికులు దిగి ఆందోళన చేపట్టారు. ఏసీ బాగుచేస్తేనే.. రైలును కదలనిస్తామని స్పష్టం చేశారు. రెండు గంటలపాటు ప్లాట్‌ఫారంపై రైలు నిలిపేశారు. రైల్వే అధికారులు నచ్చజెప్పినా వెనక్కి తగ్గలేదు. లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఆర్పీఎఫ్ ఎస్ఐ మాల్యాద్రి ఘటనా స్థలానికి చేరుకుని.. ప్రయాణికులు, రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారు. విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద రైలు అరగంటపాటు నిలుపుదల చేస్తారని, ఆ సమయంలో ఏసీ బాగు చేస్తారని భరోసా ఇవ్వడంతో ప్రయాణికులు శాంతించారు. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలగకూడదని ఆందోళన విరమిస్తున్నామని తెలిపారు.

గాలీవాన బీభత్సం

- ఎగిరిన ఇంటి పైకప్పులు
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


కవిటి: వరక వద్ద కూలిన విద్యుత్ స్తంభం


మెళియాపుట్టి : నందవలో ఇళ్లు ధ్వంసమవడంతో ఆదుకోవాలని కోరుతున్న బాధితులు సవర అప్పన్న, సుంకన్న తదితరులు


మెళియాపుట్టి: నందవలో సవర చిన్నబాబు, పెద్ద సోంబూరుకు చెందిన ఇళ్లపై కప్పులు ఎగిరిపోయిన దృశ్యం

(మెళియాపుట్టి/ కవిటి/ సోంపేట)

జిల్లాలో గాలీవాన బీభత్సం సృష్టించాయి. శుక్రవారం రాత్రి ఉరుములు.. మెరుపులతో వర్షం కురిసింది. మరోవైపు ఈదురుగాలులతోపాటు పిడుగుల మోత మోగింది. దీంతో పలుచోట్ల చెట్లు, స్తంభాలు నేలకూలడం, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం మధ్యాహ్నం వరకు కొన్నిచోట్ల విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఈదురుగాలల బీభత్సానికి మెళియాపుట్టి మండలంలో నందవలో సవర చిన్నబాబు, సవర పెద్ద సోంబూరి, సవర అప్పన్న, సవర సుంకన్నకు చెందిన ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. వర్షపునీటికి గోడలు తడిచి మట్టిపెళ్లలు పడడంతో బాధిత గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మెళియాపుట్టి మండలంలోని పట్టుపురంలో పలువురు రైతులకు చెందిన పశువుల పాకలు సైతం ధ్వంసమయ్యాయి.

పిడుగుపాటుతో ఆవుల మృతి..


కంచిలి: పిడుగుపాటుకు మృతిచెందిన ఆవులను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారిణి శిరీష

కంచిలి, జూన్ 1: కంచిలి మండలంలో శుక్రవారం రాత్రి రెండుచోట్ల పిడుగుపాటుకు గురై నాలుగు ఆవులు, ఒక దూడ ప్రాణాలు కోల్పోయాయి. జెన్నాఘయి గ్రామంలో నల్లా భాస్కరరావుకు చెందిన పాడి ఆవు పిడుగుపాటుతో మృతి చెందింది. అలాగే కొండిపుట్టుగకు చెందిన కోరాడ తరణయ్యకు చెందిన మూడు ఆవులు, ఒక దూడ కూడా మృతి చెందాయి. తరణయ్య.. తన ఆవులను, దూడలను కంచిలి మండలం ఎక్కల గ్రామంలోని ఖాళీ పొలంలో మంద వేశాడు. శుక్రవారం రాత్రి సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే దూడ, మూడు ఆవులు మృతి చెందాయి. శనివారం వీఆర్వో ఎం.బాలాజీ, పశువైద్యాధికారిణి శిరీష బాధిత రైతులను కలిసి వివరాలు నమోదు చేసుకున్నారు. తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

● సోంపేట మండలం పలాసపురంలో బల్లెడ ప్రసన్నకుమార్ ఇంటిపై పిడుగు పడడంతో.. గోడ పాక్షికంగా దెబ్బతింది.


సోంపేట: పలాసపురంలో పిడుగుపడి.. పగిలిన గోడ


ఇచ్ఛాపురం: ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది..

12 ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధం..

ఇచ్ఛాపురం: పిడుగుల దెబ్బకు ఇచ్ఛాపురం మునిసిపాలిటీ, మండల పరిధిలో 12 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయని ఏఈ గోవిందరావు తెలిపారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో 5, బిర్లంగిలో -2, తేలుకుంచి, హరిపురం, బొడ్డకాళి, కొఠారి, ఏఎస్‌పేటల్లో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి.. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని వివరించారు.

దిక్సూచి DIKSUCHI

నిట్ తిరుచిరాపల్లిలో పీహెచ్‌డీ



తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇనీషియల్ స్క్రీనింగ్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 146 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన వారు గరిష్ఠంగా ఆరేళ్లలో; పార్ట్ టైం అభ్యర్థులు గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తి చేయవచ్చు.

విభాగాలు-సీట్లు: ఆర్కిటెక్చర్ 8, కెమికల్ ఇంజనీరింగ్ 8, కెమిస్ట్రీ 7, సివిల్ ఇంజనీరింగ్ 13, కంప్యూటర్ అప్లికేషన్స్ 8, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 11, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 13, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ 3, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 5, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్ 7, మేనేజ్‌మెంట్ స్టడీస్ 7, మేథమెటిక్స్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 13, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ 8, ఫిజిక్స్ 6, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/డిజైన్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాలకు పీజీ(హ్యూమానిటీస్/సోషల్ సైన్స్/ఎకనామిక్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/కామర్స్/స్టాటిస్టిక్స్) పూర్తి చేసి ఉండాలి. మేథమెటిక్స్‌కు (మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)(ఎంఏ/ఎమ్మెస్సీ); ఫిజిక్స్‌కు పీజీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/ మెటీరియల్స్ సైన్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్); కెమిస్ట్రీకి పీజీ(కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ) పూర్తిచేసి ఉండాలి. విభాగాన్ని అనుసరించి డీఎస్‌టీ/డీఏఈ/ఎన్‌బీహెచ్‌ఎం/ఇన్‌స్పయిర్/యూజీసీ/సీఎస్ఐఆర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/క్యాట్/ఏఐఎంఏ/ఎక్స్ఏటీ/ వ్యాట్/ జీవ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్

- మొత్తం 146 ఫుల్ టైమ్ హెచ్‌టీఆర్ఏ ఫెలోషిప్స్‌తోపాటు విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కింద ఎలక్ట్రానిక్స్ & ఐటీ విభాగాల్లో మరో 5 ఫెలోషిప్స్ ఉన్నాయి.
- ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అయిదేళ్లపాటు ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలపాటు రీసెర్చ్ గైడ్‌గా వ్యవహరిస్తూ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ సూచనల ప్రకారం అకడమిక్ వర్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి పీఎంఆర్ఎఫ్ ఫెలోషిప్ వర్తిస్తుంది.
- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; తరవాత మూడేళ్లు నెలకు రూ.43,750 ఇస్తారు. హాస్టల్ సౌకర్యం లభించని వారికి ఫెలోషిప్ మొత్తంలో 16 శాతాన్ని రీయింబర్స్‌మెంట్ ఆఫ్ రెంట్(ఆర్ఓఆర్)గా ఇస్తారు. రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1.2 లక్షలు; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సపోర్ట్ కింద రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 20 నుంచి 30 వరకు
- **వెబ్‌సైట్:** nitt.edu

ఐఐఎస్‌డబ్ల్యూబీఎంలో ఎంఎస్‌డబ్ల్యూ

కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఐఐఎస్‌డబ్ల్యూబీఎం)- 'మాస్టర్స్ ఇన్ సోషల్ వెల్ఫేర్(ఎంఎస్‌డబ్ల్యూ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ సెషన్స్, ప్రజంటేషన్స్, సెమినార్లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ వర్క్స్ ఉంటాయి. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు: చైల్డ్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కరెక్షనల్ సోషల్ వర్క్, కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్, లేబర్ వెల్ఫేర్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ సహా ఏదేని ప్రొఫెషనల్ డిగ్రీ/అయిదేళ్ల ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 28
- **రిటెన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** జూలై 10, 11
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 28 నుంచి
- **వెబ్‌సైట్:** www.iiswbm.edu

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎగ్జామ్‌కు సంబంధించిన మోడల్ పేపర్లను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1DWg1oeలో చదవండి.

కేదార్‌నాథ్‌లో తలైవా



నటుడిగా తను ఎంత బిజీగా ఉన్నా మధ్యలో వీలు చూసుకుని హిమాలయాలకు వెళ్లడం తలైవా రజనీకాంత్‌కు అలవాటు. కొన్ని రోజులు అక్కడే ధ్యానంలో గడుపుతుంటారు. అలాగే మే 29న ఆయన ఉత్తరాఖండ్ వెళ్లి కేదార్‌నాథ్, బదరీనాథ్ ఆలయాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ పోలీసులు ఆయనకు స్వాగతం పలికి, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కేదార్‌నాథ్‌లో రజనీకాంత్ ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సిద్ధమవుతున్న హరిహర వీరమల్లు



పవన్‌కల్యాణ్ తన కెరీర్‌లో తొలిసారిగా చేస్తున్న హిస్టారికల్ ఎపిక్ వారియర్‌మూవీ 'హరిహర వీరమల్లు'. 17 వ శతాబ్దంలో పేదల కోసం పోరాడిన యోధుడి పాత్రను ఆయన ఇందులో పోషిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతికృష్ణ బ్యాలెన్స్ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేయబోతున్నారు. భారీ బడ్జెట్‌తో ఎ.ఎం.రత్నం ఈ సినిమా నిర్మిస్తున్నారు. భారతదేశంలోనే అత్యంత డిమాండ్ ఉన్న సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస 'హరిహర వీరమల్లు' చిత్రానికి వర్క్ చేయనున్నారు. త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించే పనిలో నిర్మాత ఉన్నారు. ప్రస్తుతం లొకేషన్ల కోసం రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ షూట్ చేసిన సన్నివేశాలకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఈ ఏడాది చివరికి 'హరిహర వీర మల్లు' పార్ట్ వన్ 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'ను విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్, సునీల్, నోరా ఫతేహి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యాక్షన్ ప్యాక్డ్ మూవీ

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు నాట అభిమానులను సంపాదించుకున్నారు తమిళ హీరో విజయ్ ఆంటోని. ఇప్పుడు ఆయన 'తుఫాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ నెల్లోనే



ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'తుఫాన్ యాక్షన్ ప్యాక్డ్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "తుఫాన్ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఒక దీవిలో జరిగే కథ ఇది. హీరో క్యారెక్టరైజేషన్ సరికొత్తగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. ఈ చిత్రాన్ని కమల్ బోరా, డి. లలిత నిర్మిస్తున్నారు. సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



బ్లాక్‌బస్టర్ గ్యారంటీ

శర్వానంద్

"మనమే' చిత్రం మ్యాజికల్ బ్లాక్ బస్టర్. ఈ సారి కుమ్మేశాం. ఇది రాసి పెట్టుకోండి. ఈ నెల 7న థియేటర్లలో కలుద్దాం. ఇది కుటుంబం అంతా కలసి ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా. 'శతమానం భవతి' కన్నా పెద్ద హిట్ అవుతుంది. మిమ్మల్ని ఏమాత్రం నిరాశపరచదు' అని శర్వానంద్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'మనమే'. కృతిశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో మీరుచూసింది కొంచెమే. 'మనమే' అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. మీ తల్లితండ్రులకు చూపించండి. ఈ సారి కొత్త శర్వాను చూడబోతున్నారు. కృతి తన నటనతో ఇరగదీసింది' అన్నారు. సినిమాలో ఎమోషన్‌తోపాటు ఎంటర్టైన్‌మెంట్ ఉంది అని కృతిశెట్టి చెప్పారు. ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్, ప్రేక్షకులు ఆదరించాలి అని వివేక్ కూచిభొట్ల కోరారు.

డూప్ లేకుండా కాజల్ యాక్షన్ సీక్వెన్స్ చేశారు

\- సుమన్ చిక్కాల



'ఎమోషన్, యాక్షన్ అంశాలతో 'సత్యభామ' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యాక్షన్ పార్ట్ కోసం కాజల్ అగర్వాల్ ఎంతో కష్టపడ్డారు. చాలా ధైర్యంగా స్టంట్స్ చేశారు' అని దర్శకుడు సుమన్ చిక్కాల అన్నారు. కాజల్ అగర్వాల్ పోలీసాఫీసర్‌గా నటించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడారు.

- సినిమాలపై ఆసక్తి ఉండడంతో ఉద్యోగం చేస్తూనే చిత్రపరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించాను. దర్శకుడు శశికిరణ్ తీసిన కొన్ని సినిమాలకు పనిచేశాను. ఆయన ఈ సినిమాకు దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చారు. కొంతమంది పోలీసుల జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా కథ రాసుకున్నాను.
- అయితే 'సత్యభామ' కథ రాయడం పూర్తయ్యాక లీడ్‌రోల్‌లో ఎవరైనా హీరోయిన్ చేస్తే బావుంటుంది అనుకున్నాం. కాజల్ కథ వినగానే 'ఎస్' చెప్పారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్‌లు చేశారు. సత్యభామ తన దగ్గరకు వచ్చిన ఒక కేసును పర్సనల్‌గా తీసుకుంటుంది. ఎమోషనల్ అవుతుంది. బాధితురాలికి న్యాయం చేసేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమవుతుంది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఆ విల్లాలో ఏం జరిగింది?



విజయ్, శీతల్ భట్ జంటగా నటించిన 'విల్లా 369' చిత్రం షూటింగ్ పూర్తయింది. సురేశ్ ప్రభు దర్శకత్వం వహించారు. ' ఆ విల్లాలో ఏం జరిగింది అనే థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో చిత్రాన్ని రూపొందించాం. సెన్సార్ పూర్తి చేసి, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం. టీజర్, ట్రైలర్ కూడా రిలీజ్ చేస్తాం' అని ఆయన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్, ఫొటోగ్రఫీ: ఎస్.కె.రఫీ, లైన్ ప్రొడ్యూసర్: శీలం ప్రణయ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: ఎం.లక్ష్మణ్‌బాబు, చిత్రం శ్రీను.

పిల్లలతో విహార యాత్ర



తమిళ దర్శకుడు విఘ్నేశ్ శివన్, హీరోయిన్ నయనతార దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం హాంకాంగ్ పర్యటనలో ఉన్నారు. డిస్నీల్యాండ్ రిసార్ట్స్‌లో దిగిన ఫొటోలను విఘ్నేశ్ షేర్ చేస్తూ 'పన్నెండేళ్ల క్రితం 'పోడా పోడీ' షూటింగ్ కోసం ఇక్కడికి వచ్చాను. అప్పుడు నా దగ్గర వెయ్యి రూపాయలే ఉన్నాయి. షూస్ కూడా లేవు. చెప్పులతో ఈ ప్రదేశమంతా తిరిగా. ఇప్పుడు నా భార్య, పిల్లలతో ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది' అంటూ పేర్కొన్నారు.

హనీమూన్ సాంగ్



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్టైనర్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. సుహాసినీ, తనికెళ్ల భరణి కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాల రాజ్ నిర్మించారు. శనివారం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్‌ను దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు బాల మంచి టైటిల్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. టైటిల్ సాంగ్ చాలా బావుంది. ఈ సినిమా మంచి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. పాప్ సింగర్ స్మార్తి జితేందర్ ఈ టైటిల్ పాటను స్వరపరిచి, ఆలపించారు. ఈ చిత్రానికి సంగీతం : కల్యాణి మాలిక్, సినిమాటోగ్రఫీ: శిష్టా వీఎంకే

ఈదురు గాలుల బీభత్సం

- జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- రేకుల షెడ్లు ఎగిరి.. గోడలు బీటలు వారి..
- మామిడి, జీడి పంటలకు నష్టం
- పంటలను రక్షించుకునేందుకు రైతుల పాట్లు

జిల్లాలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు చెట్లు నేలకూలి, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయి బాధితులు నిలువ నీడలేకుండాపోయారు. అలాగే పలు నిర్మాణాల గోడలు బీటలు వారాయి. ఆ ఈదురు గాలులకు మామిడి, జీడి పంటలు నేలరాలగా, పొలాల్లోని పంటలను రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి రాత్రంతా ప్రజలు ఉక్కపోతతలో అల్లాడిపోయారు. వివరాలిలా ఉన్నాయి..


పట్టుపురంలో దాబాపై విరిగిన దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఇంటి పైకప్పులు ఎగరడంతో పాటు విద్యుత్‌వైర్లు తెగిపోయాయి. నందర గ్రామానికి చెందిన సవర చిన్నబాబు, సవర అప్పన్న, సవర సోంబూరి చెందిన ఇంటిపై రేకులు ఎగిరి పోవడంతో వారంతా లబోదిబో మంటున్నారు. కుటుంబ సభ్యులం దరూ పడుకునే సమయంలో అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులకు రేకులు ఎగిరిపోయి, మట్టిపెళ్లలు వారిపై పడ్డాయి. దీంతో ఒక్కసారి వారంతా ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన మరి కొందరి పశువులు పాకలు సైతం పాడయ్యాయని బాధితులు తెలిపారు. పట్టపురం గ్రామా నికి చెందిన బమ్మిడి దామోదరరావు, ముక్తాపురానికి చెందిన దర్మాన రమేష్‌కు చెందిన పశువులు పాకల రేకులు సైతం ఎగిరి పోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మేడపైన ఉన్న సిమెంటు కుందలు పాడయ్యాయి. పరశు రాంపురం, చీపురుపల్లి మార్గంలో విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బాధిత గిరిజనులను టీడీపీ, జనసేన నాయకులు సవర కుమార్, సవర రామూర్తి, కిరణ్ పరామర్శించారు. బాధితులను ఆదుకోవాలని కోరారు.

రోడ్లపై విరిగి పడిన చెట్లు..

శ్రీకాకుళం క్రైం: నగరంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడగా, వైర్లు తెగిపడ్డాయి. దీంతో శనివారం పారిశుధ్య సిబ్బంది వీటిని తొలగించారు. ఈ పనులను నగరపాలక కమిషనర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. కొన్ని చోట్ల రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణాలు పడిపోగా వాటిని కమిషనర్ సరిచేయించారు.

అంధకారంలో గ్రామాలు

నరసన్నపేట: నరసన్నపేట మండలంలో ఉరుములు, మెరుపులతో శుక్రవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. ఈదురు గాలలకు మామిడి, జీడిమామిడి, బొప్పాయి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఉన్న ధాన్యం, నువ్వు పంటలను రక్షించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. నరసన్నపేటలో రోడ్లపై మురుగునీరు ప్రవహించింది. ఈదురు గాలులకు ఉర్లాం, దేవాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో పలు గ్రామాల్లో అంధకారం నెలకొని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొన్నారు.


శ్రీకాకుళంలో చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ అమీమ్ అన్సారియా

● **పోలాకి:** శుక్రవారం రాత్రి ఆకస్మికంగా కురిసిన వర్షాలు, పిడుగులు, ఉరుముల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. రాత్రి 7 గంటల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు, ఈదురుగాలులకు మామిడి కాయలు, చెట్లుకొమ్మలు నేలకొరిగాయి. శనివారం సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ● **జలుమూరు:** తిలారు ఫీడర్ పరిధిలో జోనంకి గ్రామం వద్ద చెట్టు కొమ్మలు పడి శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో 10 గ్రామాల ప్రజలుఎ విద్యుత్ సరఫరా లేక అల్లాడిపోయారు. సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షం పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనాలు విలవిల్లాడారు. శనివారం విద్యుత్ అధికారులు కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇంటిపై పిడుగుపడి..

సోంపేట: పలాసపురం గ్రామంలో బల్లెడ ప్రసన్నకుమార్ ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంటిగోడ కొంతవరకు పగిలింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణంలో ఉదయం 5 గంటలకు, గ్రామాలకు మధ్యాహ్నం వరకు సరఫరా చేయలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కంప్యూటర్లు ధ్వంసం

కంచిలి: శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం, పిడుగుల ప్రభావానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్లు కాలిపోయినట్టు ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం కళాశాలలో పనులు ముగించుకున్న తర్వాత తాళాలు వేసి వచ్చామన్నారు. శనివారం ఉదయం వెళ్లి చూసేసరికి కంప్యూటర్లు వైర్లు, సీపీయూలు కాలిపోయాయన్నారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్టు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు చాలా చోట్ల రోడ్లపై చెట్లు కూలిపోయి విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ● **కవిటి:** మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి శనివారం రాత్రి 7 గంటల వరకు అంధకారంలో మగ్గిపోయాయి. శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి వరక గ్రామానికి సమీపంలో చెట్టుపడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. శనివారం సాయంత్రం వరకు స్థానికులు వచ్చి చెట్టు తొలగిస్తేనే తప్ప విద్యుత్ అధికారులు స్పందించలేదని గ్రామస్థులు తెలిపారు. దీనితో బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలతో పాటు తీరప్రాంత గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాగునీటికి ప్రజలు ఇబ్బందిపడ్డారు.

12 గంటల పాటు...

రణస్థలం: శుక్రవారం రాత్రి ఉరుములతో కురిసిన వర్షం ప్రజలకు కొంత ఊరట ఇచ్చినప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాత్రి 11 గంటల నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక పోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. బంటుపల్లి, కోష్ఠ, కమ్మసిగడాం, సంచాం, మత్స్యకార గ్రామాల్లో శనివారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములతో కూడిన వర్షం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యాయి.


నరసన్నపేట: విద్యుత్ లేక అంధకారంలో ఉన్న జమ్ము జంక్షన్


కంచిలి: పాడైన కంప్యూటర్ పరికరం


జలుమూరు: జోనంకి వద్ద విద్యుత్ లైన్‌పై పడిన చెట్టు కొమ్మలు

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉమ్మడి పార్టీ ఏజెంట్లు మరింత అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యా లయంలో కౌటింగ్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు కేంద్రాల్లో అప్ర మత్తంగా ఉండాలన్నారు. ఇతర పార్టీ ఏజెంట్లు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా సహనంతో ఉండాలని వారు నిబంధనలను అతిక్రమిస్తే పీవో దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపా ధ్యక్షుడు పీఎంజే బాబు, పార్లమెంటరీ పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రోణంకి కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ నల్లి సాయి (కుడివైపు)

పాతపట్నం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ నల్లి సాయి స్పష్టంచేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. ఈనెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరూ భావోద్వేగాలకు గురి కాకుండా ఉండాలని కోరారు. సర్కిల్ పరిధిలో 144 అమలులో ఉన్నందున గుంపులుగా తిరగడం, సమావేశాలు నిర్వహిం చడం నిషేధమన్నారు. ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ఊరేగింపులు, బాణసంచా కాల్పులకు అనుమతులు లేవన్నారు. అలాగే సవరణ చేసిన మోటార్ వెహికల్ యాక్ట్ అమలులోకి వచ్చిందని, మైనర్‌లు వాహనాలు నడిపితే రూ.25 వేల వరకు అపరాధ రుసుం వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. ఆయనతో ఎస్ఐ మహమ్మద్ యాశిన్ ఉన్నారు.

మెట్‌కోర్ పరిశ్రమ తనిఖీ

టెక్కలి: రావివలసలో ఉన్న మెట్‌కోర్ ఎల్లాయిస్ పరిశ్రమను శనివారం కాలుష్య నియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ పరిశ్రమ నుంచి ఎక్కువ శాతం కాలుష్యం వెలువడుతోందని వచ్చిన ఫిర్యా దుల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌నాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కాలుష్యం తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా కాలుష్యం వల్ల పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

తూర్పుగోదావరి జట్టు విజయం

కె.కొత్తూరు (టెక్కలి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు శనివారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. విజయనగరం-తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి జట్టు మొదట బ్యాటింగ్ చేసి 174 పరుగులు చేయగా, విజయనగరం జట్టు 19.1 ఓవర్లలో 92 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో తూర్పుగోదావరి జట్టు 81 పరుగులతో విజయం సాధించింది.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

టెక్కలి: స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల మధ్య ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకు?

- మేజర్ పంచాయతీలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

నరసన్నపేట: మేజర్ పంచాయతీలో చేపడుతున్న వివిధ రకాల ఖర్చులకు సంబంధించి రికార్డుల నిర్వహణలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పంచాయతీ సభ్యులు సానుపల్లి కృష్ణబాబు, గొలివి రామారావు, బోయన సతీష్ ప్రశ్నించారు. శనివారం మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ బి.శంకరరావు అధ్యక్షతన నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, బడ్జెట్‌పై చర్చించారు. తాగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, మోటార్ల రికార్డులను ఎన్ని సమావేశాల్లో అడిగినా ఇవ్వడం లేదని, దీనికి కారణమేంటని కృష్ణబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ ఆదాయవ్యయాలు, ఆర్థిక సంఘం నిధుల ఖర్చుల వివరాలను బిల్లులతో సహా సమావేశంలో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే..


కొత్తపేట రోడ్డుపై గుంతల్లో చేరిన నీరు

ఎచ్చెర్ల: చిన్నపాటి వర్షానికే తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట మీదుగా అంబేడ్కర్‌నగర్ వరకు ఉన్న రోడ్డు నరకాన్ని తలపిస్తోంది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి ఇబ్బందికరంగా తయారవుతుంది. ఈ రోడ్డుపై వెళ్లేందుకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా వండి అందించాలని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో శనివారం వంట నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, హెచ్ఎం వేణుగోపాలరావు, సీఆర్పీలు రవికుమార్, పట్ట వైకుంఠరావు, సూర్యనారాయణ, ఎర్రన్న, డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన జిల్లా న్యాయాధికారి


జైలు అధికారితో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

పాతపట్నం: స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా న్యాయాధి కారి జునైద్ అహ్మద్ మౌలానా శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. జైలులోని మౌలిక సదుపాయాలను, రికార్డులను పరిశీలించారు. కోర్టు భవనాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతివారం ముద్దాయిలకు వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఆయన వెంట లీగల్ సర్వీసెస్ అథారిటీ మండల ఛైర్‌పర్సన్ మనీస్ రోషిణి, న్యాయ వాదులు బీఈ సత్యనారాయణ, జి.ఫల్గుణరావు, మెట్ట రామారావు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


బ్యాంకును ప్రారంభిస్తున్న విశాఖ రీజనల్ హెడ్ శాలినీ మీనన్, వెంకట్ తిలక్

పలాస: దేశంలోనే అతిపెద్ద బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ అవతరించిందని, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ బ్యాంకు విశాఖపట్నం జోనల్ హెడ్ శాలినీ మీనన్, శ్రీకా కుళం రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్ అన్నారు. స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా శనివారం బ్యాంకు నూతన బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీడి వ్యాపారులకు రుణాలు అందిస్తామన్నారు. కాశీబుగ్గ బ్రాంచిని పలాస కు తరలించినప్పటికీ ముందున్న సిబ్బందితోనే మెరుగైన సేవలు అందిస్తామని బ్యాంకు అధికారులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్వీస్ హెడ్ మురళీకృష్ణ, చీఫ్ మేనేజర్ ఎస్.రవికుమార్, రీజనల్ సెక్రటరీ కె.తేజేశ్వరరావు, బ్యాంకు మేనేజర్ యవ్వారి లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తన నమూనాల సేకరణ


పత్తి విత్తనాలను సేకరిస్తున్న ఏవో శ్రీనివాసరావు

కొత్తూరు: పట్టణంలోని జై కిసాన్ రైతు డిపోలో పత్తి విత్తనాల నమూనాలను సేకరించినట్లు వ్యవసాయాధి కారి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం దుకాణాన్ని తనిఖీ చేశారు. సేకరించిన విత్తనాలను తాడేపల్లి గూడెంలోని ప్రాంతీయ విత్తన పరీక్షా కేంద్రానికి పంపుతామని, అక్కడ మొలక శాతం, భౌతిక స్వచ్ఛత, జన్యు స్వచ్ఛత ప్రమాణాల పరీక్ష నిర్వహించి నివేదిక అందిస్తారన్నారు. నిర్దేశించిన ప్రమాణాల మేరకు విత్తనాలు లేక పోతే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధి కారులు ఎల్.మాధవరావు, బి.రమేష్ పాల్గొన్నారు.

నేడు వరహాలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

కొత్తూరు: మహాసింగి గ్రామంలోని పురాతనమైన వరహా లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీకూర్మం దేవాలయ అర్చకులు గోపినంబాళ వరదాచార్యులు పర్యవేక్షణలో కల్యాణం జరుగుతుందని, భక్తులు తరలివచ్చి తిలకించి పునీతులు కావాలని కోరారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు.

ఇక్కడేం జరుగుతోంది..

- ఆందోళన చెందిన ప్రజలు
- మాక్‌డ్రిల్ అని తెలిసి ఊపిరిపీల్చుకున్న వైనం
- ఫలితాల తరువాత అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు: డీఎస్పీ నాగేశ్వర రెడ్డి

పలాస, జూన్ 1: శనివారం ఉదయం 10 గంటలు.. ప్రధాన మార్గంలో ఓ పక్క ఆందోళనకారుల నినాదాలు, మరో పక్క పోలీసు బలగాల మోహరింపు.. అక్కడ ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి.. పోలీసు లకు వ్యతిరేకంగా ఉద్యమకారులు మరికొంత ముందుకొచ్చి చేసిన నినాదాలు చేస్తూ రాళ్లు రువ్వారు.. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం హోరెత్తింది. వారిని అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయు ప్రయోగం, గాలిలోకి కాల్పులు చేశారు.. ఇదంతా చూస్తున్న వారికి ఏం అర్థం కాలేదు. ఉద్రిక్తత పెరిగి ఇరువర్గాల మధ్య భీకర పోరు సాగింది.. పోలీసు లాఠీచార్జ్, బాష్పవాయు ప్రయోగం, ఆందోళనకారుడికి గాయాలు.. ఇలా అనేక రీతుల్లో అక్కడ సాగిన దృశ్యం చూపరులను ఆందోళనకు గురిచేసింది.. కొద్ది సేపటికి వారికి అర్థమైంది. ఇది మాక్‌డ్రిల్ అని.. శనివారం డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఐ విజయానంద్ పర్యవేక్షణలో జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వివిధ పోలీసు బలగాలు, పోలీసు విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది ఆందోళనకారుల రూపంలో వచ్చి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాల తరువాత గ్రామాల్లో ఎవరైనా అలజడులు సృష్టిస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని హెచ్చరించారు. ఇరుపార్టీల నాయకులు సంయ మనం పాటించాలని కోరారు. గ్రామాల్లో అలజడులు, దాడులు, హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాము అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని చెప్పేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించామని వివరించారు.


ఆందోళనకారులపై లాఠీ ఝులిపిస్తూ..


గాలిలోకి టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ..

విద్యార్థులకు స్లో సైక్లింగ్ పోటీలు


స్లో సైక్లింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

నందిగాం: నందిగాం శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థు లకు స్లో సైక్లింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా ..

పాతపట్నం: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రంథాలయాధికారి కాళ్ల రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్స్‌గా బి.బెనర్జీ, కిల్లారి శ్యాంబాబు వ్యవహరించారు.


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మత్స్యకార భరోసా ఏదీ?

- సకాలంలో నగదు రాక ఇక్కట్లు
- లీన్‌మంత్ మరో 15 రోజుల్లో పూర్తవుతున్నా జమ కాని మొత్తం
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

వజ్రపుకొత్తూరు: మత్స్యకారులకు లీన్‌మంత్ సమయంలో రాష్ట్రప్రభుత్వం అందించాల్సిన మత్స్యకార భరోసా మొత్తం లబ్ధిదారులకు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు లీన్‌మంత్‌గా గుర్తించి ఈ సమయంలో సముద్రంలో వేటను నిషేధించారు. ఈ 60 రోజుల్లో చేపల పునరుత్పత్తి జరిగే కాలంగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వేటను నిషేధించింది. ఈ నిషేధ కాలానికి ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.10 వేలు వంతున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయాల్సి ఉంది. అయితే లీన్ మంత్ మరో 15 రోజుల్లో పూర్తవుతున్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో లీన్‌మంత్ కాలంలో ఒక్కో మత్స్యకారునికి రూ.4 వేలు నగదుతో పాటు ఉచితంగా బియ్యం, ఇతర వస్తువులు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కుటుంబానికి రూ.10 వేలుగా ప్రకటించినా ఇప్పటి వరకు ఇవ్వలేదని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. అలాగే పరిహారం చెల్లింపులో కూడా పక్షపాతం చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో పరిహారం సొమ్ము పక్కదారి పడుతోందనే విమర్శలు లేకపోలేదు. జిల్లాలో 15 వేల మంది మత్స్యకారులను ఈ పథకం కింద ఎంపిక చేయగా వజ్రపుకొత్తూరు మండలలోఓ 1700 మంది లబ్ధిదారులున్నారు. దీనిపై ఎఫ్‌డీసీ ధర్మరాజు పాత్రోను వివరణ కోరగా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశామని, నిధులు విడుదలైన వెంటనే వారి ఖాతాల్లో జమచేస్తామన్నారు.

పోస్టల్ సేవలకు అంతరాయం

టెక్కలి: టెక్కలిలో ప్రధాన తపాలా కార్యాలయానికి శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం పోస్టాఫీసు తెరిచిన సమయం నుంచి విద్యుత్ లేకపోవడంతో ఖాతాదారులు గంటల తరబడి వేచి ఉండి నిరాశతో వెనుదిరిగారు. మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

జగన్నాథ రథానికి మరమ్మతులు

పలాసరూరల్: తర్లాకోటలో జగన్నాథుడి రథయాత్రకు ఏర్పాట్లు ప్రారంభిం చారు. దీనికి సంబంధించి రథానికి మరమ్మతులను శనివారం చేపట్టారు. రథానికి ఉన్న ప్రధాన అడ్డు కర్రలు, ఇరుసులు, చక్రాలకు మరమ్మతులు చేపడుతున్నారు. పూర్వ కాలం నుంచి రథయాత్ర రాజుల ఆధ్వర్యంలో జరుగు తుండగా, కాలక్రమేణా గ్రామస్థులు, యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.



పాము కాటుతో బాలుడు మృతి


శ్రీరామ్(ఫైల్)

కంచిలి: బొగాబెణి గ్రామానికి చెందిన వసంత్ కుమార్ మనుమడు శ్రీరామ్ పాణిగ్రాహి (13) గురువారం రాత్రి పాము కాటుకు గురై, చికిత్స పొందుతూ శనివారం బరంపురం ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం కళింగదళకి చెందిన శ్రీరామ్ పాణిగ్రాహి తన తాత వసంత్ కుమార్ ఇంటి వద్ద ఉంటూ గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం అర్ధరాత్రి బాలుడు ఇంట్లో నిద్రిస్తుండగా, మెడ ఎడమవైపున పాము కాటు వేసింది. బాలుడిని వెంటనే సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం బరంపురం పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

దాడిపై ఫిర్యాదు

బూర్జ: తమపై కొంతమంది దాడి చేసినట్టు లాబాం గ్రామానికి చెందిన మెట్ట మంగమ్మ, ఆమె భర్త భుజంగరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి వారి ఇంటిలో మాటమాటా పెరిగి కేకలు వేసుకున్నారు. ఆ సమీపంలో ఉన్న ఆమె బావ కుమారుడు సత్యనారాయణ, అతని భార్య సరిత, మెట్ట సన్యాసిరావు, మెట్ట చిన్నమ్మడు తమనే తిడుతున్నామని తప్పుగా భావించి దాడి చేశారు. మంగమ్మ భర్త భుజంగరావు పాలకొండ ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం భుజగరావు పొలానికి వెళ్లగా.. సత్యనారాయణ దాడి చేసి గాయపరిచాడు. ఈ విషయంపై సర్పంచ్ కృష్ణారావు వద్దకు వెళ్లగా అక్కడ మంగమ్మపై మెట్ట సన్యాసిరావు, మెట్ట చిన్నమ్మడు, మెట్ట సరిత దాడి చేశారు. దీంతో భర్త భుజంగరావుతో కలిసి బూర్జ పోలీసులకు మంగమ్మ ఫిర్యాదు చేశారు. గాయపడిన వీరు పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ

● జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి మీనాక్షి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ సాధ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. నేటి నుంచి 30వ తేదీ వరకు మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ఆరోగ్య, మున్సిపల్, సచివాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల రోజుల పాటు దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. 2021లో 117 కేసులు, 2022లో 89 కేసులు, 2023లో 54 కేసులు నమోదయ్యాయని, 2024లో ఇంతవరకు ఒక కేసు మాత్రమే నమోదయిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సంఘ సేవకుడు మంత్రి వెంకటస్వామి, శ్రీకాంత్, సూరప్పరావు, నర్సింహులు, మురళి, సాయికుమార్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: పెంట గ్రామంలో షిర్డీసాయి ఆలయ 11వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడహారతి, సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, చందనాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నారాయణసేవా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, సాయిసేవక్‌లు తదిరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

ఆమదాలవలస: ప్రజలందరూ చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం సమస్యాత్మక గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్డెన్‌సెర్చ్ భాగంగా వంజంగిలో ఆయన పోలీస్ బృందంతో పర్యటించి ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామంలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ప్రజలు తోడ్పడకుండా పోలీస్‌వారికి సహకరించాలని కోరారు. ఎటువంటి ధ్రువ పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌కు ఎనిమిది అవార్డులు


అవార్డు అందుకుంటున్న దృశ్యం

అరసవల్లి: 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రా పోస్టల్ సర్కిల్ సమావేశం చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ అధ్యక్షతన విశాఖలో జరిగింది. చిన్న పొదుపు ఖాతాల ప్రారంభం, గ్రామీణ తపాలా జీవిత బీమా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం విభాగాల్లో శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌కు ఎనిమిది అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా వై.ఇంద్రసేన, ఇన్‌స్పెక్టర్ పోస్టల్, కాశీబుగ్గ సబ్ డివిజన్, బీపీఎం దూదమ్మ, పోస్టల్ ఖాతాలు, ఇద్దరు డైరెక్ట్ ఏజెంట్లు శ్రీదేవి, వాణిలను సత్కరించి అవార్డులను అందజేశారు.

సమన్వయంతో పనిచేయాలి

అరసవల్లి: రానున్న వర్షాకాలంలో వ్యవసాయ, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యుత్తు శాఖలకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఆమె వివిధ శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ సీజన్‌కు 1.70 లక్షల హెక్టార్లలో పంటలు పండించేందుకు ప్రణాళికలు రూపొందించామని, దాదాపు 36 వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ నెల 6 నుంచి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. డ్వామా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 33 రోజుల సగటు పనిదినాలు కల్పించామని డ్వామా పీడీ చిట్టిరాజు తెలిపారు. వచ్చే మార్చి నాటికి జిల్లాలో జాబ్ కార్డు ఉన్నవారందరికీ 75 రోజుల పనిదినాలను కల్పిస్తామని తెలిపారు. జిల్లాలోని 1.55 లక్షల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డీఎంహెచ్‌వో బి.మీనాక్షి మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు సైతం జిల్లాలో మందులు అందుబాటులో ఉన్నాయని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానం ద్వారా అవసరమైన వారికి అన్ని రకాల మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్మన్లు సిరిపురపు జగన్, పాలిన శ్రావణి, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్‌ను నియమించండి

గార: బూరవెల్లితో పాటు నాలుగు పంచాయతీలకు సంబంధించి విద్యుత్ లైన్‌మెన్ లేక రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసే లైన్‌మెన్ గతేడాది అనారోగ్యంతో చనిపోయాడు. కనీసం ఇన్‌చార్జిని కూడా నియమించలేదు. దీంతో వ్యవసాయ పంపుసెట్లు ఉన్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా లైన్‌మెన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.


అరసవల్లి: శ్రీకాకుళం నగరంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పూజలు


మందసలో పల్లకిలో ఆంజనేయ స్వామి ఊరేగింపు


సారవకోటలో ఆంజనేయస్వామికి పూజలు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి


జిల్లా వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని నిమ్మకాయలు, తమలపాకులతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చనలు, సింధూర్చానలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నసమారాధన చేపట్టారు.

– ఆంధ్రజ్యోతి బృందం


పోలాకి: సంతలక్ష్మిపురం హనుమాన్ ఆలయంలో..


నందిగాంలో..


గార: పూసర్లపాడులో..


కంచిలి: అర్జునాపురంలో..


కవిటి: కొత్తూరు గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు


వజ్రపుకొత్తూరు: కొండవూరులో గౌతు శిరీష


టెక్కలి: అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


ఇచ్ఛాపురం: దాసన్నపేట జంక్షన్ వద్ద 3008 తమలపాలకులతో..


జలుమూరు: పెద్దదూగాంలో బారులుదీరిన భక్తులు


హిరమండలం చిన్నకోరాడ వద్ద..


పలాస: సీతారామాలయం వద్ద..


నరసన్నపేట: హనుమంతుని దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు


ఎచ్చెర్ల: కుశాలపురంలో..


జి.సిగడాం: హనుమాన్‌కి పూజలు చేస్తున్న భక్తులు

చేనేత కార్మికులకు కలిశెట్టి అభినందన

లావేరు: ప్రధానిగా హ్యాట్రిక్ సాధించనున్న మోదీకి అభినందనలు తెలిపే చేనేత వస్త్రాల నేత పనులు సకాలంలో పూర్తి చేసిన నేతన్నలను విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అభినందించారు. శనివారం లావేరులోని చేనేత కార్మికులు బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను అప్పలనాయుడు స్వయంగా కలుసుకుని వస్త్రాల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుకున్న సమయం కంటే ముందుగానే పనులు పూర్తి చేయగలిగామని చేనేత కార్మికులు తెలిపారు. ప్రధాని మోదీ చిత్రాన్ని డిజైన్ చేసి చేనేత వస్త్రాలను నేసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను కలిశెట్టి అభినందించారు. అలాగే ఎన్డీఏ కూటమిలో విజయం సాధించనున్న నారా చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌లకు అభినందనలు తెలిపే చేనేత వస్త్రాలను కూడా త్వరలో పూర్తి చేయాలని చేనేత కార్మికులైన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులను ఆయన కోరారు.

మోదీకి అందించనున్న చేనేత వస్త్రాన్ని పరిశీలిస్తున్న కలిశెట్టి →



అకాల వర్షంతో ఇబ్బందులు

● ఏబీ రోడ్డులో గుంతలు


పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏబీ రహదారిపై ఏర్పడిన గుంతలు

సరుబుజ్జిలి: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 7 గంటలకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీనికి తోడు భారీ గాలులు వీయడంతో ప్రజలు హడలిపోయారు. అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వీధుల్లో భారీ నీటి ప్రవాహం కనిపించింది. వర్షానికి అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గాలులకు పలు చోట్ల ఫ్లెక్సీలు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కూన జమ్మన్నపేట వద్ద ఉన్న విద్యుత్ లైన్ పరికరాలు కాలిపోయాయి. దీంతో మండలం లోని పలు గ్రామాలకు రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు దో మల బెడద మధ్య కునుకు లేకుండా కాలం వెల్లదీయాల్సి వచ్చింది. శనివారం ఉద యం విద్యుత్ సిబ్బంది వచ్చి లైన్లను బాగు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

అలరించిన భరతనాట్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రికి చెందిన గాయత్రి నిత్యకళానికేతన్ అధ్యక్షురాలు గాయత్రీ పట్నాయక్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనలో శ్రీనేత్రి, చాముండేశ్వరి, హేమశ్రీ, స్వాతిశ్రీ, సాయి హాసిని, గాయత్రి, లేఖన, సహస్ర, దేదీప్య, తేజస్వి తదితరులు పాల్గొన్నారు. చిట్టి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు, రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, రిటైర్డు జడ్పీ సీఈవో సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న న్యాయాధికారి పరేష్‌కుమార్

ఇచ్ఛాపురం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ న్యాయాధికారి మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షుడు పి.పరేష్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందికి రమణయ్యరెడ్డి అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాల్‌లో సోయల్డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశంపై విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం అంతా సమష్టిగా కృషి చేయాలని అందులో భాగంగానే తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందిస్తే.. ఆ చెత్త నుంచి సంపద తీయవచ్చునన్నారు. న్యాయవాదులు ఎన్.రమణయ్యరెడ్డి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, దేవరాజురెడ్డి, సీతయ్యరెడ్డి, నాగరాజుపాత్రో, బైరాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

రణస్థలం: పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని తలిదండ్రులను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి కోరారు. శనివారం ముక్తుంపురం, కొండముల గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం కలిగిన ఆధ్యాపకులు, మంచి వసతి సదుపాయం ఉందని, విద్యార్థులకు ఈఏఎంసెట్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు.

రోడ్డు పక్కనే చెత్త

గార: బోరవానిపేట వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే చెత్తను వేస్తున్నారు. నిత్యమూ రద్దీగా ఉండే ఈ రహదారి పక్కనే ఇలా చెత్త కుప్పలు వల్ల అపరిశుభ్రంగా పరిసరాలు తయారు అవుతాయని, దగ్గరలోనే ప్రాథమిక పాఠశాల కూడా ఉందని ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త →



పాఠశాలకు పంపించాలి


సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు

సోంపేట: దివ్యాంగ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఐఈఆర్‌పీలు రమేష్, శ్రీను కోరారు. మండలం పొత్రఖండ, పాలవలస, కర్తలిపాలెం గ్రామాల్లో దివ్యాంగ విద్యార్థుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్, టీఏ స్కాలర్‌షిప్ అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 31మంది చిన్నారులను గుర్తించినట్లు ఆయన తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో మిగుల సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అన్నా శ్యాముల్ లెంక శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల 10వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రికార్డులు పారదర్శకంగా ఉండాలి

ఆమదాలవలస: గ్రామ సంఘాలు, మహిళా స్వయంశక్తి సంఘాలు, నెలవారి జరుపుతున్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండల పరిధిలో ఉన్న తొగరాం గ్రామ సంఘంలో గ్రామ సంఘం ద్వారా సీఐఎఫ్, స్త్రీనిధి రుణాలు పొందిన సంఘాల రికార్డులను, గ్రామ సంఘం రశీదులను పరిశీలించారు. డబ్బులు చెల్లించిన వెంటనే రికార్డుల్లో నమోదు చేసి రశీదులు ఇవ్వాలని వీవోఏ కుమారిని ఆదేశించారు. పంచసూత్రాలు పాటిస్తున్న అన్ని సంఘాలకు ఇంటర్నల్ లెండింగ్ తప్పనిసరిగా జరిపించి నెలవారి సంఘానికి వచ్చిన వడ్డీ సంఘ సభ్యులందరికీ చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వయంశక్తి సంఘం ఆర్గనైజర్ ఎండ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

5లోగా ధ్రువపత్రాలు అందజేయాలి

రణస్థలం: కొండములగాం ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి, ఇంటర్మీడియట్ సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 5వ తేదీ లోపు ధ్రువ పత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపిక జాబితా విడుదల చేశామన్నారు.

గాలులతో కరెంట్ కష్టాలు

ఎచ్చెర్ల: శుక్రవారం రాత్రి వీచిన గాలులకు, ఉరుములు, మెరుపులకు ఎచ్చెర్ల మండలంలోని పలు గ్రామాల్లో కరెంట్ కష్టాలు తలెత్తాయి. ఎచ్చెర్ల పరిసర గ్రామాల్లో చెట్ల కొమ్మలు పడిపోవడంతో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ వినియోగదారులు నానా అవస్థలు పడ్డారు. శనివారం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో తాగునీటి కోసం కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 252 మంది హాజరు

ఎచ్చెర్ల: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం పాలిసెట్ కౌన్సెలింగ్ -2024 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో కొనసాగుతుంది. శనివారం 75,001 నుంచి 92,000 లోపు ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించగా 252 మంది హాజరు కాగా, ఇందులో ఓసీ, బీసీ విద్యార్థులు 210 మంది, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 42 మంది ఉన్నారు. ఆదివారం 92,001 నుంచి 1,08,000 లోపు ర్యాంకు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికేట్ల జరుగుతుంది. ఈ నెల 3వ తేదీకి బదులుగా 6వ తేదీన సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుంది. 6వ తేదీన 1,08,000 నుంచి చివరి ర్యాంకు వరకు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికేట్లను పరిశీలిస్తారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సమన్వయకర్త జి.దామోదరరావు, సహాయ సమన్వయకర్త డి.మురళీకృష్ణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరుగుతుంది.